

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 23 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 143 పేజీలు: 4 వెల: రూ 3-00

## అధికారులు, ప్రజల మధ్య మానసిక బంధం అవసరం : మోదీ



న్యూఢిల్లీ : దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకుగల అడ్డంకులను అభ్యుదయ కాంక్షగల జిల్లాలు తొలగిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రశంసించారు. ముఖ్యమైన ప్రభుత్వ పథకాలను అమలు చేయడంపై దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక యంత్రాంగం కలిసికట్టుగా ఓ జట్టుగా పని చేస్తుండటం వల్ల ఈ జిల్లాల్లో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఇతరుల ఆకాంక్షలు మన సొంత ఆకాంక్షలు అయినపుడు, ఇతరుల కలలు నెరవేరడం మన విజయానికి కొలమానం అయినపుడు, ఆ కర్తవ్య మార్గం చరిత్రను సృష్టిస్తుందని చెప్పారు. నేడు అభ్యుదయ కాంక్షగల జిల్లాల్లో ఈ చరిత్రను సృష్టిస్తుండటం మనం చూస్తున్నామన్నారు. పై స్థాయి నుంచి క్రింది స్థాయికి, అదేవిధంగా క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు పరిపాలన ప్రక్రియ సజావుగా జరగడం కోసం పాలనా యంత్రాంగం, ప్రజల మధ్య ప్రత్యక్ష, మానసిక అనుబంధం ఉండాలని పిలుపునిచ్చారు. అభ్యుదయ కాంక్షగల జిల్లాల్లో మన దేశం సాధిస్తున్న విజయాలకు ప్రధాన కారణం ఏకాభిముఖత, కేంద్రీకరణ అని తెలిపారు. అవే వనరులు, అదే ప్రభుత్వ యంత్రాంగం, ఆ అధికారులే అయినప్పటికీ ఫలితం మాత్రం విభిన్నంగా ఉందన్నారు. సుపరిపాలనకు జిల్లా యంత్రాంగం చాలా అవసరమని చెప్తూ, పథకాలను మెరుగ్గా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం దోహదపడుతుందన్నారు. క్షేత్ర స్థాయి సందర్శన, తనిఖీలకు సవివరమైన మార్గ దర్శకాలను రూపొందించాలని అధికారు లను ఆదేశించారు. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు ఎలాంటి ఉత్సాహంతో ఉన్నారో అదే ఉత్సాహంతో దేశ కోసం సివిల్ సర్వెంట్లు పని చేయాలని పిలుపు నిచ్చారు. అభ్యదయ కాంక్షగల ప్రతి జిల్లాలో నూ గడచిన నాలుగేళ్ళలో జన్ ధన్ ఖాతాలు నాలుగునుంచిఐదు రెట్లు పెరిగాయ న్నారు. దాదాపు ప్రతి కుటుంబానికి ఓ మరుగుదొడ్డి ఉందన్నారు. ప్రతి గ్రామం లోనూ విద్యుదీకరణ జరిగిందన్నారు. పేదల ఇళ్ళకు విద్యుత్తు చేరడం మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో శక్తిని నింపిందన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే జిల్లాల అభివృద్ధి




న్యూఢిల్లీ,జనవరి22(): ప్రజల భాగస్వామ్యంతోనే వెనుకబడిన జిల్లాల అభివృద్ధి వేగవంతమవు తుందని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా దేశం లో పలుజిల్లాలు నేటికీ చాలా వెనుకబడి ఉన్నాయ న్నారు. ఈ జిల్లాల అభివృద్ధికి ఎదురవు తున్న సమస్యలను తొలగించా లని, సాంకేతికత, సృజనాత్మ కతతో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. నీతి ఆయోగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహి ంచారు. వెనకబడ్డ జిల్లాల్లో అభివృద్ధిపై వివిధ రాష్ట్రాల్లో ముఖ్యమం త్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు తదితరుల తో వీడియో కాన్ఫరె న్స్ ద్వారా ప్రధాని మాట్లాడారు. వివిధ అంశాల్లో ప్రగతిపై నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ ప్రజంటేషన్ ఇచ్చారు. తాడేపల్లి లోని తన క్యాంప్ కార్యాలయం నుంచి ఆంధ్రప్ర దేశ్

### నేటికీ అనేక జిల్లాలు పురోగమించని దుస్థితి
### సిఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ
### వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏపి సీఎం జగన్

ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొ న్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ముఖ్యమంత్రి తీసుకున్న చొరవ అభినంద నీయం అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువ అధికా రులను సుదీర్ఘకాలం నియమిం చి జిల్లాల అభివృద్ధికి తోడ్పడు తున్నా రన్నారు. సెలవు రోజు సైతం ముఖ్యమ ంత్రుల సమావేశానికి హాజరుకా వడం వారి చిత్తశుద్ధికి నిదర్శన మని ప్రధాని ప్రశంసించారు. క్యాంప్ కార్యాలయం నుంచి సీఎస్ సమీర్ శర్మ, వ్యవసా యశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొం డయ్య, పాఠశాల విద్యాశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖ ర్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, అటవీ,పర్యావరణం,సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ టి విజయ్ కుమా ర్‌రెడ్డి, ఉన్నతాధికారులు వీడి యో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## వచ్చే వారంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం





వచ్చే వారంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం కానున్నట్లు సమాచారం. యాసంగి సీజన్ సాగు, తాగునీటి అవసారలపై ఈ కమిటీలో అధికారులు చర్చించనున్నారు. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల నీటి అవసరాలను వివరించాలని లేఖలు అందాయి. ఈ మేరకు రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలకు కేఆర్ఎంబీ లేఖలు పంపింది. ఈ సమావేశంలో రాష్ట్రాల నీటి అవసరాలపై చర్చలు జరిపిన అనంతరం.. ఎన్ని నీళ్లను విడుదల చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ‘లేదంటే నా దగ్గర ఉన్న సీసీ ఫుటేజ్ విడుదల చేస్తా’

విజయవాడ: తన కె కన్వెన్షన్‌లో ఎలాంటి కాసినో జరగలేదని మంత్రి కొడాలి నాని మరోసారి తేల్చిచెప్పారు. పక్క ప్లాన్ ప్రకారం ఇలాంటి ప్రచారం చేస్తున్నారని కొడాలి నాని మండిపడ్డారు. శనివారం సాక్షి న్యూస్‌తో మాట్లాడిన కొడాలి.. చంద్రబాబు బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పెట్టింది పేరని విమర్శించారు. ‘నాపై ఆరోపణలు చేస్తే భయపడతానని అనుకుంటున్నాడు. కాసినో జరగలేదని ఆధారాలు ఉన్నప్పుడు నిజనిర్ధారణ కమిటీ ఎందుకు?, టీడీపీ నేతలు చేసిన ఆరోపణలు నిరూపించాలి. లేదంటే నా దగ్గర ఉన్న సీసీ ఫుటేజ్ విడుదల చేస్తా. క్యాసినో పెట్టినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా. టీడీపీ హయాంలో నియోజకవర్గానికో క్లబ్ నడిపిన చరిత్ర చంద్రబాబుది. రాష్ట్రంలో క్లబ్‌లన్నీ మూసేసిన చరిత్ర జగన్ ప్రభుత్వానిది’ అని కొడాలి తెలిపారు.



## ఏపీలో కొత్తగా 12,926 కరోనా కేసులు



అమరావతి: రాష్ట్రంలో కరోనా విజృంభిస్తోంది. సంక్రాంతి పండుగ అనంతరం కేసులు భారీగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై వైద్యాధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఏపీలో కొత్తగా 12,926 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనాతో ఆరుగురు మృతి చెందారు. రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసులు 21,66,194 నమోదయ్యాయి. కరోనా కారణంగా మొత్తం మరణాలు 14,538 సంభవించాయి. ప్రస్తుతం 73,143 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం

### : ఏడుగురు మృతి? 15 మంది పరిస్థితి విషమం

ముంబయి: మహారాష్ట్రలోని ముంబయిలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవదహనమయ్యారని స్థానిక మీడియా వెల్లడించింది. సెంట్రల్ ముంబయిలోని తాడ్‌దేవ్ ప్రాంతంలో 20 అంతస్థుల గల కమలా బిల్డింగ్‌లోని 18వ ఫ్లోర్‌లో మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. 18వ ఫ్లోర్‌లో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మరో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

## సోము వీర్రాజు దేశ భక్తుడా? తెలుగుదేశం భక్తుడా?: వెల్లంపల్లి



అమరావతి: ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడైన సోము వీర్రాజు దేశ భక్తుడా? తెలుగుదేశం భక్తుడా? అని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుతో కలిసి ఆలయాలను కూల్చిన చరిత్ర బీజేపీదేనని వెల్లంపల్లి విమర్శించారు. సోము వీర్రాజు కార్పొరేటర్‌గా కూడా పనికిరాని వ్యక్తి అని ధ్వజమెత్తారు. రాష్ట్రాభివృద్ధిపై కేంద్రంతో ఏనాడైనా మాట్లాడారా? అని సూటిగా ప్రశ్నించారు. సోము వీర్రాజు, సీఎం రమేష్, సుజనా చౌదరిలు రాష్ట్రానికి పట్టిన చీడ పురుగులని అన్నారు. చంద్రబాబుకు కొందరు బీజేపీ వలస పక్షులు అమ్ముడుపోయారని విమర్శించారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ పాలన చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు 40 దేవాలయాలు కూలిస్తే సోము వీర్రాజు ఏం చేశారని ప్రశ్నించారు. టీడీపీతో కలిసి ప్రభుత్వం పంచుకుంటూ గుడులు కూల్చిన ఘనత బీజేపీదేని మండిపడ్డారు. ఆయన సోము వీర్రాజు కాదని, సారా వీర్రాజు అని ఎద్దేవా చేశారు. అటువంటి వ్యక్తి.. వైఎస్సార్‌సీపీపై మత, కుల ముద్ర వేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీలో బీజేపీని ఎవరూ పట్టించుకోరని, అందుకే మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి చూస్తున్నారని మండిపడ్డారు.

## జగన్‌ను నిద్ర లేపడానికే వచ్చాం

### ఏపిలో బుజ్జగింపు రాజకీయాలు తగవు
### బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్

కర్నూలు,జనవరి22(ఎ): సీఎం జగన్ ను నిద్ర లేపడానికే వచ్చానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అన్నారు.ఏపీ ప్రభుత్వం దమన కాండను చెప్పడానికే వచ్చానని, ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. ఏపీలో పోలీస్ స్టేషన్లు తగులబెట్టారు..పోలీస్ లపై దాడులు చేస్తున్నారు? అలాంటి వారిపై తక్కువ యాక్షన్ తీసుకొని బీజేపీ క్యాడర్ పై కేసులు పెడుతున్నారని అరుణ్ సింగ్ ఆరోపించారు. యూపీలో ఎస్పీ ప్రభుత్వంలో మతదాడులు జరిగేవి.. 2017లో ప్రజలు ఎస్పీ ప్రభుత్వాన్ని జనం ఎత్తేశారు. ఇది జగన్ గుర్తుంచుకోవాలన్నారు. వైసీపీని దించి బీజేపీని గద్దెనెక్కిస్తారన్నారు. అస్సాంలో కూడా కాంగ్రెస్ ఓటు రాజకీయాలు చేసినందుకు ఆ ఆ పార్టీని దించి బీజేపీకి అధికారం ఇచ్చారన్నారు. త్రిపురలో కూడా కమ్యూనిస్టులకు గుణపాఠం చెప్పారన్నారు. ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాల్లో కూడా వారి బాలికలు బయటికి వచ్చే పరిస్థితులు ఉండవన్నారు. పాకిస్తాన్ గెలిచినప్పుడు సంబురాలు చేసుకుంటున్నారు. అన్ని మతాల అభివృద్ధిని కోరుతూ మోడీ పరిపాలిస్తున్నారు. జగన్ మోడీ పాలనను చూసి నేర్చుకోవాలంటూ చురకలు అంటించారు. ఎమ్మెల్యే చక్రపాణి తల్లిదండ్రులు మంచి పేరు ఎత్తారు.ఎమ్మెల్యే డబుల్ గేమ్ ఆడుతూ మసీదు నిర్మాణాన్ని ప్రోత్సహించారు. జగన్ అధికారంలోకి వచ్చే ముందు 3 వేల కి.మీ పాదయాత్ర చేసి జనంలోకి వచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చాక జనంలోకి రావడం లేదు.ఎంపీ , ఎమ్మెల్యేలను కూడా కలవడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే సీఎం జగన్ తన లేబుల్ వేసుకుని ప్రచారం చేసుకుంటున్నారని అరుణ్ సింగ్ ఎద్దేవా చేశారు. ఆత్మకూరు ఘటనపై ప్రభుత్వం స్పందన లేదని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ పేర్కొన్నారు. శ్రీకాంత్ రెడ్డిని హత్య చేయడానికి వచ్చిన వారిని వదిలి ఆయన పైనే హత్యాయత్నం కేసు పెట్టారన్నారు. గుడివాడలో కేసినో నడిపినా పోలీస్ వ్యవస్థ ఏమి చేయలేకపోయిందన్నారు. జగన్‌కి దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలన్నారు. దేశంలో ఎక్కడ ప్రభుత్వ వేతనాలు తగ్గించిన సందర్భాలు లేవన్నారు. ఏపీలో ఏమి చేసినా చెల్లుతుందని ప్రభుత్వం భావిస్తోందని సీఎం రమేష్ పేర్కొన్నారు.

## జగన్‌కు ఏమయ్యిందో చూపించండి

### జిల్లాకో ఎయిర్‌పోర్టు అసాధ్యమన్న అయ్యన్న



విశాఖపట్నం,జనవరి22): అమ్మా.. భారతమ్మా.. ఈ తుగ్లక్ నిర్ణయాలన్నీ చూస్తుంటే మీకు ఎలా ఉందో తెలియదు గాని, మాకైతే మీ ఆయనకి ఏదో అయిందనే అనుమానంగా ఉంది. ఎందుకైనా మంచిది ఒకసారి హైదరాబాద్‌లో గాని, విశాఖప్నటంలో గాని ఆసుపత్రిలో చూపించండమ్మా అంటూ మాజీ మంత్రి, టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు వైఎస్ భారతికి విన్నవించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఒక ఎయిర్‌పోర్ట్ కట్టాలంటూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని అయ్యన్నపాత్రుడు పూర్తిగా తప్పు బట్టారు. జగన్ నిర్ణయంపై అయ్యన్న శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మరో తుగ్లక్ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. తుగ్గక్ నిర్ణయాలతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 16 మెడికల్ కాలేజీలు ఏమయ్యాయని అయ్యన్న ప్రశ్నించారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ట్రైబల్ యూనివర్సిటీ వంటి వాటి నిర్మాణాలను గాలికొదిలేసి జిల్లాకో ఎయిర్‌పోర్టు కడతావా? అంటూ ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు, పెన్షన్ దారులకు, కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేని జగన్.. ఓటీఎస్ పేరుతో పేదల నుంచే డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. చెత్తమీద కూడా పన్ను వసూలు చేస్తూ.. జిల్లాకో ఎయిర్‌పోర్ట్ కడతామని చెప్పడానికి సిగ్గులేదా? అని అయ్యన్న పాత్రుడు నిలదీశారు.

## ఏపీలో ముగ్గురు ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి: ఏపీలో ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హిమాన్షు కౌశిక్‌ను ఏపీ భవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్‌గా నియమించింది. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నిశాంత్ కుమార్‌ను బదిలీ చేసింది. కేతన్ గార్గ్‌ను అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీఎస్ సమీర్ శర్మ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ANDHRA PRADESH
సత్యమేవ జయతే

# సంపాదకీయం

ఆదివారం 23 జనవరి 2022

## అందరి చూపు... బడ్జెట్ వైపు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29న ప్రారంభం కానున్నాయి. ఈ సారి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ వైపు అందరి చూపు మళ్లింది. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ఆమె కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. గత సంవత్సరం కూడా ఇదే ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అప్పుడు కూడా? బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడానికి కొన్ని రోజుల ముందు ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి, ప్రముఖ ఆర్థిక మేధావుల నుంచి సలహాలు, సూచనలు వెళ్లాయి. తీరా బడ్జెట్ ఆమోదం పొందిన తరువాత అది అనుకున్న స్థాయిలో యావన్మంది దేశ ప్రజల మన్ననలు పొందలేదు. సహజంగా నేడు కార్పొరేట్ కంపెనీలు ఆధిపత్యం చలాయిస్తున్న నేపథ్యంలో మన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగానే వెలువడుతున్నాయి.గత సంవత్సరం ఫిబ్రవరిలో బడ్జెట్ ఆమోదం పొందిన నెల రోజులకే కరోనా సంక్షోభం ముంచుకురావడం తద్వారా దేశ వ్యాప్తంగా అన్ని వ్యవస్థలు స్తంభించిపోవడం, పేదలు, అతి నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు వంటి అనేక కోట్లాది మంది ఆర్థిక సమస్యలతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇప్పుడిప్పుడే కొంత మేర తేరుకుంటున్నప్పటికీ? కోలుకోవడానికి మరికొంత సమయం పట్టే అవకాశం వుంది. పుండు మీద కారం లాగా కరోనా ద్వారా ఏర్పడిన ఆర్థిక సంక్షోభానికి తోడుగా దేశ వ్యాప్తంగా ఇంచుమించు అన్ని రాష్ట్రాలలో వరదలు రావడంతో అతివృష్టి వల్ల దేశ ప్రజానీకంలో మెజారిటీ ప్రజలైన రైతుల పంటలు దెబ్బతిన్నాయి. పాకిస్తాన్‌తో పాటు నేపాల్, చైనా వంటి సరిహద్దు దేశాల నుంచి కూడా ప్రతిరోజూ ఏదో ఒక రూపంలో సమస్యలు వెంటాడుతూనే వున్నాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో ప్రపంచంలో రెండవ అతి పెద్ద దేశంగా వున్న భారత సామాజిక వ్యవస్థను గాడిన పెట్టడానికి నిర్మలమ్మ ఏ తాయిలాలు తీసుకొస్తున్నారో? సామాన్యులకు ఎటువంటి ఊరట లభిస్తుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు. మరికొందరు ఆశతో? ఇంకొందరు ఆత్మ విశ్వాసంతో ప్రవేశపెట్టబోయే కొత్త బడ్జెట్‌లో ఇలా ? ఇలా వుండాలని ఈ సారి కూడా అప్పుడే సలహాలు, సూచనలతో పాటు విజ్ఞప్తులు పంపిస్తున్నారు.2018– 2019 ప్రారంభంలో ప్రపంచ దేశాలన్నీ ఆర్థికమాంద్యం ద్వారా వచ్చిన సమస్యలతో సతమత మయ్యాయి. భూతల స్వర్గంలా రాణించిన అమెరికా కూడా మొదటిసారి ఉక్కిరిబిక్కిరయ్యింది. ఆర్థిక క్రమశిక్షణకు మరో పేరుగా రాణిస్తూ? ఈ రెండు దశాబ్దాల కాలంలో దూసుకువెళ్లిన చైనా సైతం ఒడిదుడుకులకు లోనయ్యింది. అటువంటి సమయంలో కూడా భారత్ వృద్ధి రేటు 8 శాతాన్ని సాధించి ఔరా..! అనిపించుకుంది. రెండు సంవత్సరాల కిందట ప్రపంచ ధనిక దేశాలలో మన దేశానికి ఆరవ స్థానం వచ్చిందని పాలకులు చాలా సంబరపడిపోయారు. అయితే?. కేవలం ఒక శాతం కుబేరుల చేతుల్లో 70 శాతం సంపద కేంద్రీకృతమైన విషయం మరిచిపోకూడదు. కరోనా కష్టకాలంలో మన దేశం దాదాపు యాభై పేద దేశాలకు కొంత మేర ఆర్థికంగా చేయూతనిచ్చింది. ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు అభివృద్ధి చెందిన దేశాలకు సైతం మన భారత్ మేధోపరంగా ఇతరత్రా వనరుల పరంగా దిక్సూచిగా వ్యవహరిస్తున్నది. ఇలా మన దేశంలో పుష్కలమైన సహజ వనరులు, మానవ వనరులు అధికంగా ఉన్నాయి. అయితే 130 కోట్ల జనాభాలో ఎదుగూ బొదుగూ లేని 40 కోట్ల పేదల పరిస్థితిని గురించి ఆలోచించవలసి వుంది. నూతన వ్యవసాయ చట్టాల ద్వారా 'వన్ నేషన్ వన్ మార్కెట్' పద్ధతి ద్వారా పేద రైతులకు గిట్టుబాటు ధర లభించనున్నదని చిన్న తరహా, మధ్య తరహా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సౌలభ్యం రానున్నదని చెబుతున్నప్పటికీ ఇందులో ఆచరణలోకి వచ్చేసరికి సవా లక్ష అడ్డంకులు ఎదురు కానున్నాయి. రైతులకు సంబంధించిన కొన్ని పంటలకు కనీస గిట్టుబాటు ధరను నిర్ణయిస్తూ? దానికి చట్ట రూపం తీసుకురావాలనేది అన్ని వర్గాల రైతుల ఆకాంక్ష. ఇలాగే బహుళజాతి కంపెనీలు, కార్పొరేట్ కంపెనీలు ఆధిపత్యం వహించే చోట చిన్న చితక పరిశ్రమలు, దేశీయ పరిశ్రమలు వటవృక్షం కింద వేరే మొక్కలు ఎదగవనే విషయం అడుగడుగునా నిరూపితమవుతున్నది.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మన పాలకులు ఎన్నికల ముందర తీసుకొచ్చే బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తూ వచ్చారు. సంక్షేమ పథకాలు వుండవలసిందే. బహుళజాతి కంపెనీలను, కార్పొరేట్ కంపెనీలను పక్కనబెట్టి చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పెద్ద పీట వేసి బ్యాంకుల ద్వారా లింకేజీ లేకుండా నేరుగా ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తలకు చేయూతనిచ్చి వారి ఉత్పత్తులను విక్రయించడానికి వారితో ప్రభుత్వం భాగస్వామ్యం ఏర్పరచుకోవాలి. ఇలాగే రైతు ఉత్పత్తులను రైతులే అమ్ముకునే విధంగా వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఆ స్థాయిలో ఓ ప్రణాళిక తీసుకురావాలి. బడ్జెట్‌లో సామాన్యులను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూనే శాశ్వత అభివృద్ధికి కూడా దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకెళ్లాలి. ఇందుకు అన్ని రంగాలలో ప్రభుత్వ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. అప్పుడే అవినీతికి, నిర్లక్ష్యానికి చరమగీతం పాడినట్లవుతుంది. ధనకామందులు, బలవంతులు దూరం కావడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇదే సందర్భంలో ప్రపంచ దేశాలన్నీ సహకార రంగాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో భారత్‌లో కూడా సహకార వ్యవస్థకు పెద్ద పీట వేయవలసి వుంది. కార్పొరేట్ వ్యవస్థ వద్దు కో ఆపరేటివ్ వ్యవస్థ ముద్దు అనే నినాదం దేశ వ్యాప్తంగా ఊపందుకోవలసి వుంది

# సమ్మె..ఎవరికి కష్టం.. ఎవరికి నష్టం

విజయవాడ, జనవరి 22, ఆంధ్రప్రదేశ్ లో పదమూడు లక్షల మంది ఉద్యోగులు, పింఛనుదారులు ఉన్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు తాము సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి వార్నింగ్ లు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదాయంలో అత్యధిక భాగం వీరి జీత భత్యాలకే ఖర్చవుతుంది. కొత్తగా ప్రభుత్వం ఇచ్చిన ఫిట్ మెంట్ కారణంగా ప్రభుత్వంపై పదివేల కోట్ల అదనపు భారం పడుతుంది. అయినా ఉద్యోగుల్లో వేతన బాధలు చల్లారడం లేదు.రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ప్రజలు ఉన్నారు. వారిలో దాదాపు మూడున్నర కోట్ల మంది పేదలే. వారికి సంక్షేమ పథకాలను అందించడం కోసం ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా వేతనాలు పెరుగుతాయి. నెల తిరిగేసరికి ఠంచన్ గా జీతం వస్తుంది. కరోనాసమయంలోనూ వారికి జీతాల బాధ లేదు. ఆర్థిక బాధలు అసలే ఉండవు. ఉద్యోగ సంఘాల నేతల చేతి ఐదు వేళ్లకు ఉన్న బంగారు ఉంగరాలను, మణికట్టుకు ఉన్న బ్రేస్ లెట్లను చూస్తే వారి ఆర్థిక పరిస్థితి అర్థమవుతుంది. వేతనాలు సరిపోవడం లేదా? ఎందుకు వీరికి జీతభత్యాలను పెంచాలి? ఇప్పుడున్న జీవన ప్రమాణాలకు తగినట్లు వారి వేతనాలు లేవా? వేతనం సరిపోక అప్పుల పాలవుతున్నారా? ఆస్తులు పెంచుకుంటున్నారా? వేతనాలకు తోడు ఆమ్యామ్యాలు అదనమే అయినా అవి లెక్కల్లోకి రావు. ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయరన్న విమర్శలున్నాయి. హైదరాబాద్ నుంచి అమరావతికి వస్తే వారానికి ఐదు రోజులే పనిదినాలు. అది కూడా వేళకు రారు. వారు వచ్చినప్పుడే పని సమయం. వారికి ఉన్న భద్రత అలాంటిది. ప్రయివేటు కంపెనీలో పనిచేసే ఒక ఉద్యోగితో పోల్చుకుని చూస్తే వారికి అర్థమవుతుందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్తి, అనుకూలత ఉన్నంత కాలం రాజకీయంగా ఉద్యోగులు ఏమీ చేయలేరన్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అలాంటి ఉద్యోగులు ఇప్పుడున్న కరోనా పరిస్థితుల్లో సమ్మెకు వెళితే ప్రజల నుంచి వ్యతిరేకత రాదా. అసలే అవినీతి పరులుగా ముద్రపడిన(కొందరు) ఉద్యోగుల పట్ల సదభిప్రాయం ప్రజల్లో లేదు. సమ్మెకు వెళితే ప్రభుత్వం కన్నా ఉద్యోగులకే నష్టం. ఎన్నికల్లో తాము కీలకంగా మారతామని, ప్రభుత్వాన్ని మార్చేస్తామన్న ఉద్యోగ సంఘాల నేతల మాటలను ప్రభుత్వం ఎంత వరకూ పట్టించుకుంటుందో తెలియదు కాని అంత సీన్ లేదని అధికార పార్టీ చెబుతోంది. అయితే పదమూడు లక్షల మంది ఉద్యోగులు, పింఛనుదారులతో ప్రభుత్వానికి నష్టమా? అన్నది రానున్న కాలంలో తెలియనుంది.

# సమ్మెకు సమయమా....?

విజయవాడ, జనవరి 22,పట్టుదలకు పోతే ఇంతే సంగతులు. ఏదైనా పట్టువిడుపులు ఉండాలి. ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత ఉందా? సానుకూలత ఉందా? అన్నది తర్వాత చూద్దాం. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మాత్రం ప్రజల్లో అంత సానుకూలత లేదు. ముఖ్యంగా ఉద్యోగుల డిమాండ్ల సాధనకు పట్టుబట్టడానికి ఇది సరైన సమయం కాదన్న విమర్శలు విన్పిస్తున్నాయి. వారు నిజంగానే సమ్మెకు దిగితే వారు నష్టపోయే అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయి. ఉపాధి కూలీలు లక్షలాది మంది వందల కిలోమీటర్లు నడిచి వెళ్లారు. తినడానికి తిండి లేక, తాగటానికి నీళ్లు లేక అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కరోనా సమయంలో అనేక వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఏ రంగమూ లాభదాయకంగా లేదనే చెప్పాలి. ఒక్క ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ప్రతి నెల ఠంచను గా జీతాలు అందుకుంటున్నారు. మిగిలిన ప్రయివేటు కార్మికులకు ఎప్పుడు జీతం వస్తుందో తెలియదు. ప్రభుత్వోద్యోగుల్లో అత్యధిక శాతం మంది కాంట్రాక్టు సిబ్బంది పైనే ఆధారపడి ఉన్నారు. దాదాపు యాభై శాతం మందికి పైగానే నేడు కూడా కంప్యూటర్ ను ఆపరేట్ చేసే సామర్థ్యం లేదు. వారంతా కాంట్రాక్టు సిబ్బందితోనే ఎక్కువ పనులు చేయిస్తున్నారు. ఇప్పుడు ఉద్యోగుల పట్ల కపట ప్రేమను చూపిస్తున్న ఒక వర్గం మీడియా కరోనా సాకు చూపి వారి సొంత మీడియా సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతాల్లో కోత ఎందుకు పెట్టింది? లాభాలు రావడం లేదు అనే కదా? ఆర్థిక భారం మోయలేమనే ఈనాడు, ఆంధ్రజ్యోతిలో దాదాపు ఏడాది పాటు జీతాల్లో కోత విధించారు. ఖర్చులు తగ్గించుకోవడానికి అనేక విన్యాసాలు వాటి యాజమాన్యం చేసింది. వాటిని మర్చిపోయి ఇప్పుడు ఫిట్ మెంట్ ను పెంచకపోతే ఉద్యోగులు వీధినపడుతున్నారంటూ యాగీ యాగీ చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి తప్ప ఈ రెండు పత్రికల యాజమాన్యాలకు ఉద్యోగులపై అంత ప్రేమ లేదు. వీరికి అవసరమా? ఇక ఉద్యోగ సంఘాల్లో ఉపాధ్యాయులు మొన్న చేసిన ఆందోళనపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఉపాధ్యాయుడు నెలకు లక్షకు పైగానే జీతం తీసుకునే వారు కూడా ఉన్నారు. కనీసం నెలకు అరవై వేలకు తగ్గదు. ఇక సెలవులంటే వారికి ఉన్న సెలవులు ఏ ప్రభుత్వ ఉద్యోగికి ఉండవు. కానీ వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదట. అందుకనే జీతాలు పెంచాలని టీచర్లు కలెక్టరేట్ ను ముట్టడించిన తీరు విమర్శలకు తావిచ్చింది. పునరాలోచించుకుంటే.. ఉద్యోగ సంఘాలు కూడా పునరాలోచించుకుంటే మంచిది. ఒక్క హెచ్ఆర్ఏ విషయంలో మాత్రమే ఉద్యోగులకు అన్యాయం జరిగిందని చెప్పాలి. మిగిలిన అంశాల్లో వారికి జరిగిన నష్టమేమీ లేదు. ప్రజల్లో భాగమంటూనే వారు కట్టే పన్నుల నుంచి అత్యధిక భాగం తాము పొందాలనుకోవడం దురాశే అవుతుంది. అయినా సమ్మె చేయడానికి ఇది సమయం కూడా కాదు. ముందు కోవిడ్ నుంచి రాష్ట్రాన్ని బయటపడేయాల్సిన బాధ్యత ఉద్యోగులపైన కూడా ఉంది. ప్రభుత్వంపై మొండిగా వ్యవహరిస్తే ప్రజల్లో తిరుగుబాటు వస్తే అప్పుడు కాలు వెనక్కు తీసుకోవాలన్నా కుదరదు మిత్రమా? ఆలోచించుకోండి. ప్రజల నుంచి మీకు మద్దతు ఉంటుందనుకోవడం అత్యాశే. విపక్షాలు తప్ప ఎవరూ మీకు అండగా ఉండన్నది వాస్తవం.

# లీడర్లు ఎక్కడ..

ఒంగోలు, జనవరి 22, వర్గ రాజకీయాలకు పెట్టింది పేరైన ప్రకాశం జిల్లా చీరాలలో ఓటర్లు విభిన్నంగా తీర్పులు ఇస్తుంటారు. చీరాల నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన 16 శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే.. ఎనిమిదిసార్లు ఇతర పార్టీల క్యాండిడేట్స్ గెలిచారు. ప్రగఢ కోటయ్య, కొణిజేటి రోశయ్య వంటి ఉద్దండులు చీరాలలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా టీడీపీకి కూడా ఇక్కడ బలమైన కేడర్ ఉంది. చేనేత సామాజికవర్గం అధికంగా ఉండే చీరాల నియోజకవర్గంలో ఎస్సీ ఓటు బ్యాంకు కూడా బలంగా ఉంది. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కరణం బలరాం వైసీపీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై గెలిచారు. ఆ తర్వాత పరిణామాలు మారిపోయాయి. కరణం బలరాం కుమారుడు వెంకటేష్ వైసీపీలో చేరటంతో అధికారపార్టీకి బలరాం మద్దతుగా నిలిచారు.ఎమ్మెల్యే కరణం బలరాం వెళ్లిపోయాక.. యడం బాలాజీని చీరాల టీడీపీ ఇంఛార్జ్‌గా నియమించింది పార్టీ అధిష్ఠానం. ఇంఛార్జ్ హోదాలో కొద్దిరోజులు టీడీపీ కార్యక్రమాలకు హాజరైన బాలాజీ ఆ తర్వాత కార్యకర్తలకు అందుబాటులో లేకుండా పోయారట. కరణం బలరాంతోపాటు ప్రధాన నాయకులు కూడా టీడీపీని వీడి వైసీపీలోకి వెళ్లటంతో చీరాలలో తెలుగుదేశానికి ముఖ్య నేతలనేవారే లేరు. అయినప్పటికీ కేడరే పార్టీ పిలుపిచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.ప్రస్తుతం వైసీపీలో ఎమ్మెల్యే కరణం బలరాంతోపాటు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌లు పోటాపోటీగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. టీడీపీ మాత్రం ఇంఛార్జ్‌ను తేల్చడం లేదు. సారథి లేక కేడర్ డీలా పడుతున్నారని గమనించిన అధిష్ఠానం చీరాలపై దృష్టి పెట్టింది. కార్యకర్తలకు అండగా నిలబడే నేతలు లేక? ఉన్నవాళ్లూ చేజారితే నియోజకవర్గంలో టీడీపీ మరింత దిగజారిపోతోందని ఆందోళన చెందుతున్నారట. జిల్లా మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితోపాటు సజ్జల రామకృష్ణారెడ్డితో యడం బాలాజీ టచ్ ఉంటున్నారని కొందరు స్థానిక నేతల నుంచి టీడీపీ పెద్దలకు ఫిర్యాదు అందాయట.టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బృందంలోని కీలక వ్యక్తులు చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ్‌కు అనుకూలంగా.. యడం బాలాజీకి వ్యతిరేకంగా సమాచారాన్ని ఇస్తున్నారట. దీంతో నిజనిర్ధారణ కోసం టీడీపీ అధిష్ఠానం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని భావిస్తోందట. గ్రామాల కమిటీలతోపాటు మరికొన్ని గ్రామాలను కలిపి ఓ క్లస్టర్‌గా ఏర్పాటు చేసి.. కొందరు నేతలకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించబోతున్నట్టు సమాచారం. బీసీలకు బలమైన ఓటు బ్యాంకు ఉన్న చీరాలలో యాదవ సామాజికవర్గానికి చెందిన పాలేటి రామారావు రెండుసార్లు టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను ఇంఛార్జ్‌గా ప్రకటిస్తే ఎలా ఉంటుందని అంచనా వేస్తున్నారట.ఒకవేళ యాదవ సామాజికవర్గానికే అవకాశం ఇవ్వాలని భావిస్తే.. ప్రస్తుతం ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీకే చీరాల బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయట. ఇంఛార్జ్‌పై ఏ విషయం తేల్చక.. నాన్చుడు ధోరణి అవలంభిస్తుండటంతో కొన్ని ఉన్నాయట. గతంలో టీడీపీలో ఉండి ఇతర పార్టీలకు వెళ్లిన పాతకాపులు తిరిగి తీసుకురావచ్చన్న ప్రచారంతో అధిష్ఠానం వారికోసం ఎదురు చూస్తుందా.. వారి కోసమే ఇంఛార్జ్‌ని పెట్టడం లేదా అనే అనుమానాలు ఉన్నాయట. మరి టీడీపీ అధిష్ఠానం ఏం చేస్తుందో చూడాలి.

# మటన్ లేనిదే ముద్ద దిగట్లా

కర్నూలు, జనవరి 22, మాంసంలో ఎముక రుచి..పుంటికూర(గోంగూర)లో పుడక రుచి అన్నారు పెద్దలు.. సామెత సంగతేమోగాని ఆదివారం వచ్చిందంటే కొందరికి ముక్కలేనిదే ముద్ద దిగదు. బంధువులు వచ్చినారనో..చిన్నోడు కలవరిస్తున్నాడనో..ఇంట్లో బాలింత ఉందనో..బలం రావాలనో.. ఏదో సాకు చూపి కూరాకు (మాంసం) తెచ్చుకునే వారు ఎక్కువే. జిల్లా జనాభా 44 లక్షలకు పైగా ఉంటే అందులో 70 శాతం మంది మాంస ప్రియులే. వీరిలో చికెన్ తినేవారు కొద్ది మంది అయితే.. మటన్ లాగించేవారు మరికొంత మంది. ధర ప్రియం అయినా చాలా మంది మటన్ కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ప్రతి ఆదివారం జిల్లాలో 40 టన్నుల వినియోగం ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కిలో రూ.600 నుంచి రూ. 800 లెక్కన రూ.3 కోట్ల మటన్‌ను జిల్లా వాసులు ఆరగించేస్తున్నారు అన్నమాట. తలకూర, రాగి సంకటిని ఇష్టపడే వారు కొందరైతే..జొన్న రొట్టె, బోటీ రుచి అమోఘం అనే వారు మరికొందరు. కైమాతో వేపుడు చేసుకొని కమ్మగా లాగించేవారు ఇంకొందరు. ఎవరి రుచులు ఎలా ఉన్నా..దేవనకొండ మండలం ఈదులదేవరబండలో చీకులకు సాటిరావు అనే వారు కూడా ఉన్నారు. ఆదివారం వచ్చిందంటే కోసిగి, గాజులదిన్నె, సుంకేసుల ప్రాంతాల్లోనూ కడ్డీ మాంసం నిప్పులపై వేగుతూ మాంసప్రియులను ఊరిస్తూ ఉంటుంది. ఆదోనిలో అల్పాహారంగా 'పాయ' ప్రత్యేకంగా నిలుస్తోంది. పోషక విలువలు, సంతృప్తికరమైన రుచి రెండూ ఒకేదాంట్లో దొరికే తక్కువ పదార్థాల్లో ఒకటైన మటన్‌ను మాంసం ప్రియులు ఎంతోగానో ఇష్టపడుతున్నారు. ధర అధికమైనా కొనుగోలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.800 అమ్ముతుండగా పల్లె ప్రాంతాల్లో రూ.600 చొప్పున విక్రయిస్తున్నారు.జిల్లాలోని పొట్టేళ్ల మాంసం రుచికరంగా ఉంటుంది. ఈ విషయం శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. జిల్లాలో నెల్లూరు జుడిపి, నెల్లూరు బ్రౌన్ అనే రెండు రకాల పొట్టేళ్లు పెంచుతుంటారు. సారవంతమైన నేలల్లో మొలిచే గడ్డిని మేయడంతో వీటి మాంసం రుచికరంగా ఉంటుంది. ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని జాతీయ మాంసం పరిశోధన కేంద్రం(ఎన్ఆర్‌సీఎం) ధ్రువీకరించింది.జిల్లాలో 25.90 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయి. ఆదోని, డోన్, ఆలూరు, మంత్రాలయం, సంజామల, శిరివెళ్ల, కొలిమిగుండ్ల, రుద్రవరం, చాగలమర్రి, దొర్నిపాడు ప్రాంతాల్లో గొర్రెల పెంపకం దారులు అధికంగా ఉన్నారు. పత్తికొండ, నందికొట్కూరులో సోమవారం, ఆలూరులో బుధవారం, ఆదోని, గూడూరులో శుక్రవారం, కోడుమూరు, కల్లూరులో శనివారం, ఎమ్మిగనూరులో ఆదివారం ప్రత్యేక సంతలు జరుగుతాయి. ఈ సంతల్లో జీవాల క్రయవిక్రయాలు సాగుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు నంద్యాల, ఆదోని, బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల తదితర పట్టణాల్లో 2,500 మటన్ షాపులు ఉన్నాయి. జిల్లాలో 25.90 లక్షల మేకలు, గొర్రెలు ఉన్నాయి.



# మిర్చి లూటీ



గుంటూరు, జనవరి 22, పంచ వ్యాప్తంగా గుంటూరు మిర్చికి ఎంత పేరుందో అందరికి తెలిసిందే. ఘాటు మిర్చి సాగుకు గుంటూరు పెట్టింది పేరు. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో లక్షా నలభై వేల హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. అయితే తామర పురుగు పట్టడంతో మిర్చి దిగుబడి లేకుండా పోయింది. దీంతో మిర్చికి డిమాండ్ భారీగా పెరిగింది. అక్కడక్కడ కొంతమంది రైతులకు మాత్రమే ఎకరానికి పది క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. వచ్చిన పంటను జాగ్రత్తగా కాపాడుకుంటూ రైతులు వాటిని కోల్డ్ స్టోరేజ్ లకు తరలిస్తున్నారు. అయితే మిర్చికి డిమాండ్ ఉందన్న సంగతి తెలుసుకున్న దొంగలు కళ్ళాల్లో ఆరబెట్టిన మిర్చిని దొంగలించే పనిలో పడ్డారు.నాదెండ్ల మండలం నాదెండ్లకు చెందిన రైతు కొరివి కోటేశ్వరరావు పొలంలో లక్ష రూపాయల విలువైన మిర్చి ఎండబెడుతున్నారు. బుధవారం రాత్రి మిర్చిని కుప్పగా పోసి పట్టా కప్పి రాత్రి పదకొండు గంటల వరకూ కాపలా ఉన్నాడు. అర్థరాత్రి ఇంటికి వెళ్ళి తెల్లవారుజామున కళ్లం దగ్గరకు తిరిగి వచ్చి చూస్తే కళ్లంలో మిర్చి కుప్ప తగ్గిపోయి ఉంది. కప్పలో కొంత భాగాన్ని తీసుకెళ్ళినట్లు అర్థమై దొంగతనం జరిగిందని గుర్తించాడు. ఇదే విషయాన్ని నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు బాధిత రైతు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బంగారం, డబ్బు, విలువైన వస్తువులను మాత్రమే దొంగలించే దొంగలను ఇప్పటివరకూ చూశాం. ఇక ముందు మిర్చి దొంగలను తరచుగా చూడాల్సి వస్తుందేమోనని రైతులు వాపోతున్నారు.


# మాజీ నేతల కల్లోల కామెంట్లు

విజయవాడ, జనవరి 22,టీడీపీ విషయంలో మాజీ నేతలు చేస్తున్న కామెంట్లు కల్లోలం సృష్టిస్తున్నాయి. పార్టీ తరపున లబ్ధి పొంది.. తర్వాత .. ఆయా పదవులను సైతం ఫణంగా పెట్టి బయటకు వచ్చేసిన నాయకులు మౌనంగా ఉండలేక పోతున్నారు. వైసీపీ మెప్పుకోసం మాట్లాడుతున్నారనే అనుకున్నా.. ఆ రేంజ్‌ను దాటి చంద్రబాబును ఏకపక్షంగా కార్నర్ చేస్తున్నారు. గతంలో గన్నవరం ఎమ్మెల్యే వంశీ దూకుడు అందరికీ తెలిసిందే. ఏకంగా చంద్రబాబును, ఆయన కుమారుడు లోకేష్‌ను కూడా కలిసి ఉతికేశారు. అసలు టీడీపీలో ఉన్నప్పుడే చంద్రబాబు, లోకేష్ వంశీని కాదని.. అప్పటి మంత్రి దేవినేని ఉమాకు ప్రయార్టీ ఇవ్వడంతో లోలోన రగులుతూ వచ్చారు. ఇక గత ఎన్నికల్లో గెలిచాక పార్టీకి దూరమవుతోన్న క్రమంలో చంద్రబాబు, లోకేష్.. పార్టీని ఉతికి ఆరేశారు.ఇక, ఆ తర్వాత.. గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాలి గిరి కూడా ఒకింత అసహనం ప్రకటించారు. పైగా జిల్లాలో టీడీపీ నేతలను. కమ్మ సామాజిక వర్గాన్ని దారుణంగా టార్గెట్ చేశారు. ఇక కరణం బలరాం కూడా బాబును ముందు స్ట్రాంగ్‌గా విమర్శించినా ఆ తర్వాత సైలెంట్ అయ్యారు. ఇక విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌తో పాటు తోట త్రిమూర్తులు, అడారి ఆనంద్ కుమార్ ఇలా చాలా మంది పార్టీ నుంచి బయటకు వచ్చాక చంద్రబాబుపై తీవ్రంగా దుమ్మెత్తిపోసినోళ్లే. ఇక, తాజాగా టీడీపీ తరపున ఎమ్మెల్సీ అయి.. ఆ పదవికి రాజీనామా చేసి మరీ.. పోతుల సునీత వైసీపీకి మద్దతు తెలిపారు. సరే.. రాజకీయాల్లో ఇవన్నీ మామూలే అనుకున్నా.. ఆ తర్వాత టీడీపీపైనా.. ఆ పార్టీ అధినేత చంద్రబాబుపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కుట్ర కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని బాబుపై విరుచుకుపడ్డారు. దేవున్ని కూడా చంద్రబాబు వదలడం లేదు అని అన్నారు. బాబు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్న ఆమె 20 ఏళ్లు టిడిపిలో పని చేశా ఆ సమయంలో చంద్రబాబు నరకం చూపించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజానికి 20 ఏళ్లుగా బాబు నరకం చూపిస్తే.. ఆమె ఆపార్టీలో ఎందుకు ఉన్నారో ? చెప్పలేదు కానీ.. ఈ వ్యాఖ్యలు చేయడం మాత్రం చంద్రబాబు గ్రాఫ్‌ను అమాంతం పడేసింది. ఆ మాటకు వస్తే ఎక్కడో ఉన్న ఆమెను 2014 ఎన్నికల వేళ తీసుకువచ్చి చీరాల సీటు ఇవ్వడంతో పాటు ఆర్థికంగా సాయం చేసినా ఆమె ఓడిపోయారు. ఆ తర్వాత ఆమెకు ఎమ్మెల్సీ కూడా ఇచ్చారు.ఇదేదో.. రాజకీయంగా ఆమెకు ఎదురైన అనుభవం నుంచి వచ్చిన కామెంట్లు కాదని.. వ్యక్తిగతంగా ఆమెను చంద్రబాబు టార్గెట్ చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి గతంలో వైసీపీ నుంచి కూడా నాయకులు జంప్ చేశారు. కానీ, ఎవరూ ఇలా జగన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదు. కానీ, ఇప్పుడు చంద్రబాబు మాత్రం కార్నర్ అయిపోతున్నారు. పార్టీలో ఏకస్వామ్యం కొనసాగడం, కింది స్థాయి నేతలను పట్టించుకోకపోవడం వంటివే ప్రధాన కారణాలు అనుకోవాలా? లేక ఇంకేమైనా ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తమకు పదవులు ఇచ్చిన చంద్రబాబుపై ఇలాంటి కామెంట్లు చేయడం వెనుక ఏదో జరిగే ఉంటుందనే భావన మాత్రం వ్యక్తమవుతోంది. దీని వెనక వైసీపీ అధిష్టానం డైరెక్షన్ ఉందా ? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఏదేమైనా ఇప్పుడు చంద్రబాబు వీటి నుంచి బయటపడడం తక్షణ అవసరంగా నేతలు చెబుతున్నారు. మరి ఏం చేస్తారో చూడాలి.

# డెంగ్యూ జ్వరాలు నిర్మూలనకు మర్రిపాడు లో శానిటేషన్

మర్రిపాడుమండల కేంద్రములోని బాలుపల్లి గ్రామంలో స్థానిక వైద్యాధికారి వెంకట కిషోర్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ ఎస్కె బిబిజాన్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మూర్తి ఆధ్వర్యంలో విష జ్వరము లు వైరస్ జ్వరము లు డెంగ్యూ జ్వరాలను నిర్మూలించడానికి ప్రతి ఇంటికి గ్రామంలో మలాథియాన్ 25% ద్రావకమును పిచికారి చేసి ఇంటింటికి తిరిగి స్ప్రేచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సైదా ఏఎన్ఎం రమణమ్మ హెల్త్ అసిస్టెంట్లు ఓబులేసు ఖాజా ముబారక్ ఆశ సుబ్బమ్మ వాలెంటర్లు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఏపీలో కరోనా విశ్వరూపం



విజయవాడ, జనవరి 22, కరోనా ఏ రాష్ట్రాన్నీ వదలడం లేదు. నెల క్రితం వందల్లో వున్న కరోనా పాజిటివ్ కేసులు ఇప్పుడు వేలల్లోకి చేరాయి. తాజాగా ఏపీలో కరోనా భారీగా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.గుంటూరు, విశాఖ, చిత్తూరు జిల్లాలలో కరోనా కట్టడిపై అధికారులు చేతులెత్తేశారేమో అనిపిస్తోంది. జిల్లాలో రాజకీయ పార్టీల కార్యక్రమాలు, తెరుచుకున్న సినిమా థియేటర్లతో పాటు సందడి ఎక్కువైంది. మూడు నెలలుగా కరోనా కొత్త వేవ్ వస్తుందని ప్రపంచం మొత్తం మొత్తుకుంటున్నా అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లయినా లేదేమో అనిపిస్తోంది.ఇప్పుడు కరోనా కేసులు పెరుగుతున్నా వ్యాక్సిన్ వేయించుకున్న ధీమానో ఏమో తెలీదు గానీ కరోనాను లైట్ తీసుకుంటున్నారు. కరోనా వ్యాధిని అరికట్టడంలో అధికారులు సైతం చిత్తశుద్ధి చూపించడం లేదు. తెరుచుకున్న సినిమా థియేటర్లు, స్కూల్స్, షాపింగ్ మాల్స్ ఒకటేంటి ..ఇప్పుడు ఏకంగా ఎగ్జిబిషన్ లు కూడా పెట్టి కరోనాను వైఫై మాదిరిగా ఇంటింటికి పంపిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులవారు కనీస బాధ్యత, స్పృహ లేకుండా కరోనాని కాసుల కలెక్టింగ్ కి వాడేస్తున్నారు. వాస్తవానికి ఏదైనా బహిరంగంగా అ సమావేశం ఏర్పాటు చేసుకోవాలంటే, 200మంది లోపు ప్రజలు వచ్చేలాగా కరోనా నిబంధనలు పాటించే లాగా ఆంక్షలు ఉన్నాయి? ప్రభుత్వ కార్యక్రమాలు అయితే కొంతమేర పర్లేదు, అక్కడ కచ్చితంగా కొవిడ్ ఆంక్షలు అమలు చేస్తున్నారు . కానీ కొందరు అసలు నిబంధనలు పాటించడం లేదు.గడచిన 24 గంటల్లో 44,516 కరోనా నిర్ధారణ పరీక్షలు చేపట్టగా 13,212 మందికి పాజిటివ్ గా తేలింది. విశాఖ జిల్లాలో 2,244 పాజిటివ్ కేసులు రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇక, చిత్తూరు జిల్లాలో 1,585 కేసులు, అనంతపురం జిల్లాలో 1,235 కేసులు, శ్రీకాకుళం జిల్లాలో 1,230 కేసులు, గుంటూరు జిల్లాలో 1,054 కేసులు, నెల్లూరు జిల్లాలో 1,051 కేసులు నమోదయ్యాయి.కరోనా మృతుల సంఖ్య 14,532కి పెరిగింది.

## తల్లీకొడుకుల దారుణ హత్య

నెల్లూరు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం అంబటివారి పాలెం గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి కొడుకుల దారుణ హత్య జరిగింది. ఈ ఘటనలో మీరమ్మ మరియు అలీఫ్ అనే తల్లి కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలన చేస్తున్నారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది....

## సాధువులపై అనుమానం

అమలాపురం తూర్పు గోదావరి జిల్లా పి గన్నవరం మండలం ముంగండ లో నలుగురు సాధువులు కారులో మూడు రోజుల నుండి పరిసర గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరగడంతో అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో పోలీసులు వచ్చి వాళ్ళని పరిశీలించి వివరణ అడిగారు. యాత్రలో భాగంగా తిరుగుతున్నామని వారు పోలీసులకు వివరణ ఇవ్వడంతో వారు ఏటువంటి మాస్కులు ధరించకపోవడంతో ఇక్కడ పరిస్థితులు బాగోలేదని చెప్పి వారిని విజయవాడ వైపు పంపించివేశారు

## రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి బీజేపీ

కర్నూలు వైసిపి ప్రభ్యత్వంలో శాంతి భద్రతలు క్షీణించాయి. పోలీసుల ను అడ్డుపెట్టుకొని అరాచకాలను మొదలు పెట్టిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రం లో ఆలయాలపై దాడులు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా కొందరిని ప్రోత్సహిస్తున్నారని అయన అన్నారు. రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. ఆత్మకూరు ఘటన రాష్ట్రం మొత్తానికి తెలుసు.. కానీ ప్రభుత్వమ్ ఇప్పటి వరకు స్పందించలేదు. ఒక్క మంత్రి కూడా నోరు మెదపలేదు. రాష్ట్రంలో హోంమంత్రి సుచరిత మాట్లాడకపోవడం దారుణం. సంఘ విద్రోహక చర్యలను ప్రోత్సహిస్తే సహించేందిలేదని హెచ్చరించారు.



## రుయా ముందు ఉద్యోగుల అందోళన

తిరుపతి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన పి ఆర్ సి ని వెంటనే రద్దు చేయాలని తిరుపతి రుయా ఆసుపత్రి ముందు పారా మెడికల్ సిబ్బంది ఆందోళనలు చేపట్టారు. నూతన పీఆర్సీ ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అలాగే కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీ ఏమైందని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ సంఘాల నాయకులు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా, ఘర్షణ వాతావరణం కల్పించడానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జీతాలలో కోత విధిస్తారా అంటూ ధ్వజమెత్తారు. అటు ఉద్యోగ ,ఉపాధ్యాయ ఐక్యతకు మద్దతు ప్రకటించారు.

# మధ్యప్రదేశ్‌లో అకాల వర్షాలు

**19 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్**

**తెలంగాణలోనూ వర్షాలకు ఛాన్స్**

**విశాఖలో పొగమంచుతో విమానాలకు అంతరాయం**

న్యూఢిల్లీ,జనవరి22(): దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. దీంతో మార్నింగ్ వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణం చల్లగా మారడంతో పాటు ఆకాశం మేఘావృతమైంది. మరో వైపు పొగమంచు విపరీతంగా కురుస్తోంది. దీంతో వాహనదారులకు కూడా కొంత ఇబ్బంది తప్పలేదు. రాబోయే 24 గంటల్లో ఢిల్లీలో చలిగాలులు వీచే అవకాశం ఉందంటున్నారు. ఇక మధ్యప్రదేశ్ లో మాత్రం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన పడటంతో 19 జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే నాలుగు రోజుల్లో వాయువ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇకపోతే తెలంగాణలో ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి.. చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది.. ఇదే సమయంలో.. మూడు రోజుల పాటు తెలంగాణలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెబుతోంది.. రాష్ట్రంలో కొన్నిచోట్ల ఆదివారం నుంచి మంగళవారం వరకు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.. అంతేకాదు.. అకాల వర్షాలతోపాటు ఉరుములు, మెరుపులు కూడా వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది.. కాగా, ఇప్పటికే తెలంగాణలో కురిసిన వర్షాలతో పంటలకు భారీ నష్టమే జరిగింది.. పంట నష్టాన్ని అంచనావేసే పనిలో ఉన్నారు అధికారులు..

ఈ సమయంలో.. మరోసారి వర్షాలు తప్పవని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఇకపోతే విశాఖలో దట్టమైన పొగమంచు ఇబ్బందికరంగా మారింది. దట్టమైన పొగమంచు కారణంగా పలు విమానాలను దారి మళ్లించారు. మరి కొన్ని విమానాలను అధికారులు రద్దు చేశారు. ఉదయం 9 గంటల తర్వాత విమాన రాకపోకలు కొనసాగే అవకాశం ఉంది. ప్రయాణికులు గమనించాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాస్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.

# ఉద్యోగులకు మద్దతు తెలిపిన కాంగ్రెస్

**నీలి శ్రీనివాసరావు**

కడప జనవరి 22 ఉద్యోగ ,ఉపాధ్యాయ పిఆర్సి విషయంలో వారికి న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా రావలసిన వాటిని సాధించుకోవడంలో వారికి కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉండి సహాయ సహకారాలు అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తెలిపారు. పదవ పిఆర్సి వరకు పెరుగుతూ వచ్చిన జీతాలు, జగన్మోహన్ రెడ్డి పుణ్యమా అని పదకొండవ పిఆర్సి లో జీతాలు తగ్గడం చాలా విడ్డూరంగా ఉందని నీలి శ్రీనివాసరావు అన్నారు. ఇంటి అద్దె అలవెన్సు గతంలో ఉన్న దానికంటే సగానికి సగం తగ్గించడం చాలా దారుణమైన విషయమన్నారు. సి పి ఎస్ రద్దు చేయమని ఉద్యోగులు అడుగుతే, సి సి ఎ రద్దు చేసిన పెద్ద మనిషి జగన్మోహన్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వస్తూనే, సిపిఎస్ రద్దు చేస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత సిపిఎస్ రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. పెన్షనర్లకు ఎక్స్ట్రా బెనిఫిట్ 70 ఏళ్ళ కే గతంలో ఇస్తూ ఉంటే, దానిని 80 సంవత్సరాలకు చేయడం విడ్డూరమన్నారు. ఉద్యోగ , ఉపాధ్యాయ, పెన్షనర్ల కు కాంగ్రెస్ పార్టీ బాసటగా నిలుస్తుంది అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా తన తప్పు తాను తెలుసుకొని పదకొండవ పిఆర్సి విషయంలో ఉద్యోగులకు మేలు జరిగేలా చూడాలని అన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్ష పోరాటంలో సైతం దిగుతుందని అన్నారు.

# విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై కౌన్సిలింగ్

విజయవాడ జనవరి22(భవాని పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల పై భవానిపురం సీ.ఐ మురళి కృష్ణ ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం సీఐ మీడియాతో మాట్లాడుతూ తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాశాలలో కౌన్సిలింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని ప్రస్తుత యువత ఎవరైతే కాలేజీ లో చెడు స్నేహాల వలన చదువు ను నిర్లక్ష్యం చేసి మత్తుపానీయాలు, ,మాదక ద్రవ్యాలు, బైక్ రేసింగ్ లాంటి అలవాట్లను తెలిసీ తెలియని వయసులో,కాలేజీ చదువుల సమయంలోనే చెడు స్నేహాల వలన ఈ బాట పడుతున్నారని మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాల బారిన పడి ఏ విద్యార్థి కూడా తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని, సత్ప్రవర్తన కలిగి అటు తల్లిదండ్రులకు సమాజానికి మేలు చేసే విధంగా విద్యార్థుల యొక్క చదువులు ఉండాలని, తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి ఆశలు వమ్ము చేయకుండా కష్టపడి చదివి మంచి ప్రయోజకులు కావాలనే ఈ కౌన్సిలింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం అని సిఐ మురళీకృష్ణ తెలిపారు

# ఈ సారి కమలానికి 6సీట్లు...




హైదరాబాద్, జనవరి 22, ఎన్నికలు వచ్చినా సర్వేలు కామన్.. కొన్ని పార్టీలు, నేతలు సర్వే ఏజెన్సీలను సంప్రదించి మరీ సర్వేలు చేయించుకోవడం చూస్తుంటాం.. తమ పరిస్థితి ఏంటి? ఎన్నికలకు వెళ్తే ఏం జరగబోతోంది? అనేదానిపై ఓ అంచనాకు వస్తుంటారు.. అయితే, ఎన్నికలు లేని సమయంలోనూ సర్వేలు జరుగుతూనే ఉంటాయి.. పార్టీలు, నేతలు, పాలన, ప్రభావితం చేసిన అంశాలు.. ఇలా కొన్నింటిని ఎంచుకుని సర్వే చేస్తుంటారు? అయితే, తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్తే.. ఏ పార్టీ పరిస్థితి ఏంటి? అనేదానిపై ఇండియా టుడే- సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో నిర్వహించిన తాజా సర్వే ఫలితాలను వెల్లడించాయి. ఆ ఫలితాల ప్రకారం తెలంగాణలో బీజేపీ పుంజుకోగా.. అధికార టీఆర్ఎస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి కూడా ఎదురుదెబ్బ తప్పదని తేల్చింది.తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. భారతీయ జనతా పార్టీ 6 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంటుందని మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే ఫలితాలు చెబుతున్నాయి.. అంటే.. బీజేపీ అదనంగా రెండు స్థానాలను గెలుచుకోనుంది.. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో నాలుగు పార్లమెంట్ స్థానాలను బీజేపీ గెలుచుకున్న విషయం తెలిసిందే.. మరోవైపు అధికార టీఆర్ఎస్ పార్టీకి, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీకి కూడా ఎదురు దెబ్బతప్పదని తేల్చింది ఇండియా టుడే- సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే.. టీఆర్ఎస్ గత ఎన్నికల్లో 9 సీట్లలో సత్తా చాటగా.. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఒక స్థానం కోల్పోయి 8 స్థానాలకే పరిమితం కానుంది.. ఇక, కాంగ్రెస్ పార్టీ గత సాధారణ ఎన్నికల్లో మూడు పార్లమెంట్ సీట్లు గెలుపొందగా.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మాత్రం రెండు స్థానాలకే పరిమితం అవుతుంది స్పష్టం చేస్తున్నాయి సర్వే ఫలితాలు.. కాగా, తెలంగాణలో అప్పుడే పొలిటికల్ హీట్ మొదలైంది.. నేతల ప్రసంగాలు, ఆరోపణలు, విమర్శలు చూస్తుంటే.. ఇక, త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయా? అనే అనుమానాలు కలిగిస్తున్నాయి.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరిగితే ఇంకా చాలా సమయమే ఉంది.. మరి.. అప్పటి వరకు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో.. ? ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలుపొందే అవకాశం ఉందో..? విన్నర్ ఎవరు? ఎవరికి ఓటమి తప్పదు అనేది వేచి చూడాల్సిన అంశమే

# సాగునీటికోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్

కాకినాడ జనవరి22 ప్రస్తుత పరిస్థితుల్లో తూర్పుగోదావరి జిల్లాలో రెండో పంట సాగునీటి అవసరాలకు నీటి కొరత లేకుండా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రభుత్వ చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు.జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జడ్పీ స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సభ్యులు అడిగిన పలు రకాల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ వేణుగోపాల్ రావు మాట్లాడుతూ ఈ సమావేశంలో వ్యవసాయం, విద్య,వైద్యం,వసతిగృహాల అభివృద్ధి, హౌసింగ్,ఇరిగేషన్, తదితర అనేక అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికి అధికారులు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రధానంగా జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో రెండో పంటకు చివరి ఎకరా వరకు సాగునీరు అందించే విధంగా అధికార యంత్రాంగం నిర్దిష్టమైన ప్రణాళికతో

చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు.అన్ని అజెండా అంశాలను కూలంకషంగా చర్చించి, ప్రత్యేక ప్రణాళికల ద్వారా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ లు బుర్రా అనుబాబు, మేరుగ లలితా దేవి, జడ్పి సీఈఓ ఎన్.వి.వి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొవిన్ డేటా లీక్ కాలేదు



న్యూఢిల్లీ, జనవరి 22 ప్రభుత్వానికి చెందిన కోవిన్ సర్వర్ నుంచి వేలాది మంది వ్యక్తిగత వివరాలు లీకయ్యాయన్న వార్తలు దేశంలో కలకలం రేపాయి. పలువురి పేర్లు, మొబైల్ నెంబర్లు, చిరునామాలు, కోవిడ్ పరీక్షా వివరాలతో కూడిన డేటా ఆన్‌లైన్‌లో కనిపిస్తుందంటూ ప్రచారం జరుగుతోంది. అయితే.. లీకైన వివరాలన్నీ రైడ్ ఫోరమ్స్ వెబ్‌సైట్‌లో ఒక సైబర్ క్రిమినల్ అమ్మకానికి కూడా పెట్టినట్లు పేర్కొంటున్నారు. అయితే.. ఈ వివరాలు డార్క్ వెబ్‌లో కూడా లభిస్తున్నాయని, సెర్చ్ ఇంజన్లలో ఉన్న దాదాపు 9 లక్షల వివరాలను గూగుల్ ఇండెక్స్ చేసిందని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు రాజశేఖర్ రాజాహారియా ట్వీట్ చేయడంతో ఈ విషయం సంచలనంగా మారింది.అయితే.. ఈ వివరాలన్నీ కోవిన్ పోర్టల్‌లో అప్‌లోడింగ్‌కు ఉంచిన డేటా అని నిపుణులు అభిప్రాయపడ్డారు. కరోనా కాలంలో నిబంధనల పర్యవేక్షణ నుంచి వ్యాక్సినేషన్ వరకు పలు అంశాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం డిజిటలైజ్ చేసిన సంగతి తెలసిందే. అయితే దీని డేటానే లీకైందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు నిపుణులు సూచించారు.

## సింహాచలం లో మంత్రి అవంతి పూజలు

విశాఖపట్నంజనవరి22(): సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు మంత్రి దంపతులకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం కప్ప స్తంభాన్ని అవంతి శ్రీనివాసరావు దంపతులు ఆలింగనం చేసుకున్నారు. గతవారం మంత్రి అవంతి కరోనా బారిన పడ్డారు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత తన ఇష్టమైన దైవం కుటుంబ సభ్యులతో సింహాద్రి అప్పన్న దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు...

## రైల్వే కౌంటర్లలో పాములు

శ్రీకాకుళం జనవరి22(): శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వే స్టేషన్లో బుకింగ్ కౌంటర్లో త్రాచు పాములు హల్ చల్ చేశాయి. టిక్కెట్లు ఇచ్చే సమయంలో కంప్యూటర్ సమీపం లో ఇవి ఉండటం తో సిబ్బంది సిబ్బంది బెంబేలెత్తి పోయారు. స్నేక్ క్యాచర్లకు సమాచారం ఇచ్చినా సకాలంలో రాకపోవడంతో సిబ్బంది ఆ పాములను హతమార్చారు. స్టేషన్ సమీపంలో పరిసరాలు చెత్త మెక్కలతో చిత్తడి గా ఉండడంతో ఈ ప్రాంతాలు పాములకు ఆవాసాలు గా మారాయని పలువురు అభి ప్రాయపడుతున్నారు. అయితే ఇలా ఉండగా త్రాచు పాములను రైల్వే ఉద్యోగులు కొట్టి చంపడం చట్ట విరు ద్ధమని వన్య ప్రాణుల సంవరక్షులు తెలియ అభిప్రాయ పడుతున్నారు. స్థానికంగానే ఫారెస్తు అధికారులు ఉండగా వారికి సమాచారం ఇవ్వక పోవడం శోచనీయమని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

రాజమండ్రి జనవరి22(): తూర్పు గోదావరి జిల్లా బెండమూర్లంక రెవెన్యూ గ్రామ పరిధిలో మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గత కొంత కాలంగా కొనసాగుతున్న భూ వివాదంలో సర్వే కి వచ్చిన అధికారులను ఆమె అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఇంతలోనే కొటికలపూడి ప్రసన్న ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. ఆమె భర్త కొటికలపూడి పాండురంగారావుకు అతని ఐదుగురు అన్నదమ్ములకు మధ్య భూవివాదం కొనసాగుతోంది. 15 ఏళ్ల క్రితం తుమ్మల పల్లి గ్రామ పరిధిలోకి వచ్చే బెండమూర్లంక రెవెన్యూ గ్రామ పరిధిలో ఆకివీడు కి చెందిన ఆరుగురు అన్నదమ్ములు 18 ఎకరాలు కొనుగోలు చేసారు. ఎవరికి వారు వేర్వేరుగా రెండున్నర ఎకరాల చొప్పున అన్నదమ్ములు రిజిస్టర్ చేయించుకున్నారు. గత కొంత కాలంగా కొటికలపూడి పాండురంగారావు ఈ భూములన్నీ చూసుకుంటుండగా తమ భూములు తమకు అప్పగించాలని మిగిలిన అన్నదమ్ములు అడుగుతున్నట్లు సమాచారం. భూ సర్వే నిర్వహించి తమ భూములు తమకు అప్పగించాలని మిగిలిన ఐదుగురు అన్నదమ్ములు రెవెన్యూ అధికారులు ఆశ్రయించారు. ఇప్పటికే రెండు సార్లు సర్వే నోటీసులు జారీ చేసినా స్వీకరించక పోవడంతో అధికారులు మూడోసారి నేరుగా కొలిచేందుకు ప్రయత్నం చేసారు. ఈ నేపథ్యంలోనే వారిని పాండురంగారావు అతని భార్య అడ్డుకుంది. ఉన్నపాటుగా ఆమె ఒంటి పై పెట్రోల్ పోసి నిప్పంటించు కోవడంతో మంటలు చెలరేగాయి. ఆమెను పక్కనే ఉన్న పంట బొదె లోకి ఆమె భర్త త్రోసివేయడం తో ప్రాణాపాయం తప్పింది గాయపడిన మహిళ ప్రసన్న ను ఆసుపత్రికి తరలించారు.

## ఒకే ఈతలో మూడు ఆవు దూడలు

అనంతపురం జనవరి22():అనంతపురం జిల్లా మడకశిర మండలం చందకచర్ల గ్రామం లో ఒక ఆవు ఒకే ఈతలో మూడు దూడలకు జన్మనిచ్చింది. పసుల రంగప్ప అనే రైతు చాలా కాలంనుంచి పశువుల మీదే ఆధారపడుతూ జీవనం సాగిస్తున్నాడు. పసులల రంగప్ప వ్యవసాయాన్ని కూడా ఆ పశువుల ద్వారానే సేంద్రియ ఎరువులు తయారుచేసి పంటను పండిస్తున్నాడు. రంగప్ప దగ్గర ఉన్న కొన్ని పశువులలో ఒక ఆవు ఈరోజు తెల్లవారుజామున మూడు దూడలను జన్మనిచ్చిది. ఇది అరుదైన విషయం. దీంతో గ్రామ ప్రజలు వాటిని చూడడానికి వచ్చి ఆనంద వ్యక్తం పరిచారు

## కృష్ణాజిల్లా గూడూరు తాసిల్దార్ ఆఫీస్ లో ఏసీబీ దాడులు

విజయవాడ జనవరి22():గూడూరు తాసిల్దార్ ఆఫీస్ లో డబ్బులు ఇవ్వు పాస్ బుక్ పుచ్చుకో అన్న తరహాలో తాసిల్దార్ ఆఫీస్ కృష్ణాజిల్లా గూడూరు మండలం మల్లవోలు గ్రామం శ్రీ దేవి నాంచారమ్మ అమ్మవారి ఆలయం పేరు మీద పట్టాదార్ పాస్ బుక్ టైటిల్ డేట్ ప్రాసెస్ చేయుటకు 25000/- రూపాయలు లంచంగా అడిగిన మల్లవోలు విఆర్వో శ్రీనివాస రావు. అవినీతి నిరోధక శాఖ నీ సంప్రదించిన కోసూరి లక్ష్మి నాంచారయ్య విజయవాడ రేంజ్ ఏసీబీ అధికారులు ఈ రోజు కోసూరి లక్ష్మి నాంచారయ్య దగ్గర మల్లవోలు విఆర్వో శ్రీనివాసరావు లంచం తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్నారు

## పిడిఎస్ బియ్యం స్వాధీనం

గుంటూరు గుంటూరు జిల్లా తాడికొండ మండలం బడేపురం గ్రామ శివారు కొండ వెనుక గల ఉప్పలపాటి శివ జనార్దన్ రావుకు చెందిన పంపు హౌస్ షడ్ లో అక్రమంగా నిల్వ ఉంచిన పి డి ఎస్ బియ్యం ను విజిలెన్సు అధికారులు దాడి చేసి 226 బస్తాల బియ్యం ను స్వాధీనపరుచుకున్నారు. సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామానికి చెందిన వేముల రమణయ్య వినియోగదారుల వద్ద నుండి కొనుగోలు చేసి ఇక్కడ నిల్వ చేసినట్లు విజిలెన్స్ అధికారి తెలిపారు.శివ జనార్ధణరావు, రమణయ్య పై 6 ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ దాడిలో ఆర్ఐ మాదవి విఆర్ఓ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రబీ పంటలకు సాగు నీరివ్వండి

కర్నూలు తెలుగుగంగ ఆయకట్టు క్రింద రబీ లో వేసుకున్న పంటలకు సాగునీరు అందించాలని వెలుగోడు రిజర్వాయర్ సందర్శనకు విచ్చేసిన పి.ఏ.సి కమిటీ కి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి వినతి పత్రాన్ని పి.ఏ.సి చైర్మన్ పయ్యావుల కేశవ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చెప్పిన మాటలు నమ్మి వెలుగోడు, బండి ఆత్మకూరు మరియు మహానంది మండలాల్లో ఇప్పటికే 15వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని పి.ఏ.సి కమిటీ, జిల్లా అధికారుల దృష్టికితీసుకెళ్లారు.

# గాయపడిన కుటుంబాలకు అండగా ఉంటాం



**గాయపడిన వారికి 10 వేలు ఆర్థిక సహాయం**
**గాయపడిన వారినికర్నూలు హాస్పిటల్ లో పరామర్శించిన**
**టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి**

కౌతాళం జనవరి 22 ( విభారె) : పొదల కుంట, కోసిగి పెద్ద కడుబురు మండలం లోని కంపాడు గ్రామనికి చెందిన తెలుగు యువత నాయకులు హనుమన్న ను కర్నూలు జనరల్ హాస్పిటల్ లో పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్న మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి సోదరుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి అ మెరుగైన వైద్యం కోసం ప్రవేటు హాస్పిటల్ కు వెళ్ళాలి అని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. హనుమన్న కు వైద్యం కోసం పది వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు, కౌతాళం మండలం లోని పోదలకుంట గ్రామానికి చెందిన వారు సూర్య హాస్పిటల్ కు వెళ్లి వారిని కూడా పరామర్శించి పది వేల రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు. కోసిగి గ్రామ 9 వార్డు కు చెందిన వారు కూడా ఆటో ప్రమాదంలో గాయపడిన వారిని ఓమ్మిని హాస్పిటల్ కు వెళ్లి వారిని కూడా పరామర్శించి పది వేలు రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు. పల్లెపాడు మాజీ సర్పంచ్ చంద్ర చెల్లెలును జనరల్ హాస్పిటల్ లో పరామర్శంచారు. పరామర్శించిన వారిలో పెద్ద కడుబురు మండలం కన్వీనర్ బసలదోడ్డి ఈరన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాడిగేని అయ్యన్న, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు, బసలదోడ్డి క్రిష్ణ, లక్ష్మారి చిదానంద, దుద్ది నాగేష్, ఈరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖలో ఉన్న 2.35 వేల ఖాళీ లను తక్షణమే భర్తీ చేయాలి




ఎమ్మిగనూరు జనవరి 22 ( విభారె) ప్రభుత్వ శాఖలో ఉన్న 2.35 వేల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు స్. ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు ఎమ్మిగనూరు మండల తాసిల్దార్ జయన్న గారికి వినతి పత్రం అందజేసి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగం ను కూడ కల్పించలేదు ప్రతి ఏటా డిఎస్సి నిర్వహించి ఉపాధ్యాయ, పోలీస్ శాఖ లోని ఖాళీలను భర్తీ చేస్తామన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నోటిఫికేషన్ల ఊసే ఎత్తడం లేదని అదేవిధంగా ఉద్యోగుల పదవీ విరమణ వయసును పెంచి నిరుద్యోగుల ను మోసం చేస్తుంది అని తక్షణమే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు ను విరమించుకోవాలని ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు ప్రభుత్వము స్పందించక పోతే విద్యార్థులు, నిరుద్యోగులను ఏకం చేసి రాష్ట్రవాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తాం అని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో నాయకులు అర్జున్, మల్లికార్జున అశోక్ తదితరులు పాల్గొన్నారు

## ఎరువుల కర్మాగారంలో కార్మికులకు కరోనా

పెద్దపల్లి,జనవరి22( జిల్లాలో ఉన్న రామగుండం ఎరువల ఫ్యాక్టరీలో కరోనా కలకలం రేపింది. దీంతో ఉత్పత్తిని నిలిపివేశారు. సుమారు 120 మంది ఒప్పంద కార్మికులతో పాటు పలువురు శాశ్వత ఉద్యోగులు కరోనా బారిన పడటం యాజమాన్యాన్ని కలవరపెడుతుంది. వారికి ఏడురోజుల వేతనంతో కూడిన సెలవు ఇవ్వనున్నట్లు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రకటించింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ సాంకేతిక కారణాలుతో పాటు పలువురు సిబ్బందికి కరోనా సోకడంతో ఫ్యాక్టరీలో ఉత్పత్తిని నిలిపి వేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లోని ప్రిల్లింగ్‌టవర్‌లో ఏర్పడ్డ సాంకేతిక అంశాలతోపాటు పలువురు శాశ్వత ఏర్పడ్డ ,ఒప్పంద ఉద్యోగులకు కరోనా రావడంతో కర్మాగారంలో ఉత్పత్తి పనులను నిలిపివేసినట్టు యాజమాన్యం ప్రకటించింది. ప్రతిరోజూ 3,850 టన్నుల యూరియాతో పాటు అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యంతో గతేడాది ఫిబ్రవరిలో ఈ ఫ్యాక్టరీని పున: ప్రారంభించారు.

# రోజూ ఈ టీ తాగడం వల్ల మీ రక్తం శుభ్రంగా ఉంటుంది ....!



పొడి, వేయించిన లేదా తాజా బార్లీ విత్తనాలను వెచ్చని నీటితో 10 నిమిషాలు ఉడికించి, ఒక కప్పులో వడకట్టడం ద్వారా బార్లీ టీ తయారు చేస్తారు. ఈ కెఫిన్ లేని టీ రుచి కొద్దిగా చేదుగా ఉంటుంది, కాని సుగంధం రిఫ్రెష్ మరియు తీపిగా ఉంటుంది. మీరు రుచిని పెంచుకోవాలంటే నిమ్మరసం లేదా తేనె జోడించడం ద్వారా చేయవచ్చు. చైనా, కొరియా మరియు జపాన్ వంటి ఆసియా దేశాలలో ఇది సాధారణ పానీయం. మీ రెగ్యులర్ డైట్‌లో బార్లీ టీని జోడించడం అంటే మీరు కొన్ని ఆరోగ్యకరమైన జీవితాలను గడపడం ప్రారంభిస్తున్నారు. బార్లీ టీలో రుచి లేదా వాసన అధికంగా ఉంటుంది మరియు మంచి ఆరోగ్యానికి స్టోర్హౌస్ వంటిది. శరీరంపై బార్లీ టీ తాగడం వల్ల కలిగే అద్భుతాలు ఏమిటో ఈ పోస్ట్‌లో చూడవచ్చు. యాంటీఆక్సిడెంట్లు నిండి ఉన్నాయి యాంటీఆక్సిడెంట్లు నిండి ఉన్నాయి బార్లీ టీలో యాంటీఆక్సిడెంట్లు మరియు సెలీనియం, లిగ్నన్స్, విటమిన్లు ఎ మరియు సి వంటి సమ్మేళనాలు ఉన్నాయి. బార్లీ టీ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరానికి యాంటీఆక్సిడెంట్ రక్షణ లభిస్తుంది. దంతాలను రక్షిస్తుంది దంతాలను రక్షిస్తుంది బార్లీ టీలో యాంటీ బాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఓరల్ స్ట్రెప్టోకోకస్ అనేది ఒక రకమైన బాక్టీరియం, ఇది దంతాల మీద స్థిరపడటం మరియు వాటిని అనుసరించడం ద్వారా దంత క్షయం కలిగిస్తుంది. బార్లీ టీలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు బ్యాక్టీరియా వలసలను నివారిస్తాయి మరియు దంతాలకు అంటుకోకుండా నిరోధిస్తాయి, తద్వారా దంత ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది రక్తాన్ని శుద్ధి చేస్తుంది "బార్లీ టీ తాగడం వల్ల రక్తాన్ని కలుషితాల నుండి విముక్తి చేస్తుంది" అని జపాన్‌లో ఒక సాధారణ సామెత ఉంది. బార్లీ టీ రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది మరియు మలినాలను రక్తాన్ని శుభ్రపరుస్తుంది. ఇది అధిక రక్తపోటును తగ్గిస్తుంది మరియు గుండెను రక్షిస్తుంది. బార్లీ టీ రోజువారీ వినియోగం అనేక వ్యాధుల నుండి రక్తాన్ని రక్షిస్తుంది. జలుబు మరియు దగ్గును నయం చేస్తుంది జలుబు మరియు దగ్గును నయం చేస్తుంది జలుబు మరియు దగ్గు లక్షణాలను తొలగించడానికి బార్లీ టీ అద్భుతమైన వనరు. ఫ్లూ చికిత్సలో కూడా ఇది ప్రభావవంతంగా ఉంటుంది. ఇది శ్లేష్మం మరియు అడ్డంకులను విచ్ఛిన్నం చేయడానికి శరీరానికి పోషకాలను అందిస్తుంది మరియు బ్రోన్కైటిస్ మరియు ఉబ్బసం నుండి ఉపశమనం కలిగించడానికి సహాయపడుతుంది. మీరు గొంతు నొప్పితో బాధపడుతుంటే, ప్రతిరోజూ 2 కప్పుల బార్లీ టీ తాగండి. నిద్ర సమస్యలను నయం చేస్తుంది నిద్ర సమస్యలను నయం చేస్తుంది లాక్డౌన్ జీవనశైలి కారణంగా ఈ రోజుల్లో నిద్ర రుగ్మతలు సాధారణం. అయితే, బార్లీ టీ నిద్ర రుగ్మతలను తొలగించగలదు. ఇందులో అమైనో ఆమ్లాలు, మెలటోనిన్ మరియు ట్రిప్టోఫాన్ ఉన్నాయి, ఇవి వాటి ప్రభావాలను మిళితం చేసి మీకు బాగా నిద్రపోతాయి. బార్లీ టీలో కెఫిన్ లేదు, కాబట్టి నిద్రించడానికి ముందు తాగడం పూర్తిగా సురక్షితం. క్యాన్సర్‌ను నివారించడం ఒక ఇరాకీ జూ లాటరీ గెలుచుకున్నాడు, భారతీయులు అతన్ని అనుసరిస్తున్నారు ఈ హెయిర్ ఆయిల్‌తో ఏ వయస్సులోనైనా జుట్టును పెంచుకోండి! జిమ్/డైట్ లేకుండా 4 వారాల్లోబరువు/శరీర కొవ్వును తగ్గే సరైన మార్గం! . క్యాన్సర్‌ను నివారించడం బార్లీ టీలో హార్మోన్ల అసమతుల్యత వలన కలిగే అనేక రకాల క్యాన్సర్ల నుండి రక్షించగల ఫైటోన్యూట్రియెంట్స్ ఉన్నాయి. ఉదాహరణకు, బార్లీ టీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రొమ్ము క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ నుండి రక్షణ లభిస్తుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు కణాలకు జరిగే నష్టాన్ని సరిచేస్తాయి మరియు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే ఆక్సీకరణ ఒత్తిడి నుండి వారిని రక్షిస్తాయి. జీర్ణ రుగ్మతలు జీర్ణ రుగ్మతలు మీకు ఆమ్లత్వం వంటి జీర్ణ సమస్యలు ఉంటే, బార్లీ టీ సహజ యాంటాసిడ్లను కలిగి ఉన్నందున ఈ సమస్యలకు సహాయపడుతుంది. ఇది వికారం నుండి ఉపశమనం పొందుతుంది. బార్లీ ఫైబర్‌తో నిండి ఉంటుంది, తద్వారా జీర్ణక్రియను సమర్థవంతంగా చేయడం ద్వారా మృదువైన మరియు సాధారణ ప్రేగు కదలికను ప్రోత్సహిస్తుంది. ఇది మంట మరియు మలబద్ధకం నుండి కూడా మిమ్మల్ని కాపాడుతుంది.

# నిన్న రామ్ చరణ్.. ఇప్పుడు మెగాస్టార్



నేచురల్ స్టార్ నాని నటించిన చిత్రం 'శ్యామ్ సింగ రాయ్'. రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వెంకట్ బోయినపల్లి అత్యతం ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. నాని డ్యుయెల్ రోల్ లో నటించిన ఈ చిత్రంలో సాయి పల్లవి కృతిశెట్టి మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్ లుగా నటించారు. కోల్ కతా నేపథ్యంలో సాగే టైమ్ ట్రావెలింగ్ స్టోరీగా ఈ మూవీ విశేష ఆదరణ సొంతం చేసుకుంది. డిసెంబర్ 24న తెలుగు తమిళ మలయాళ కన్నడ భాషల్లో విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ తో పాటు భారీ వసూళ్లని రాబట్టి నాని కెరీర్లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న చిత్రంగా నిలిచింది.నేచురల్ స్టార్ నాని కెరీర్ లో బ్లాక్ బస్టర్ క్లాసిక్ మూవీగా నిలిచిన 'శ్యామ్ సింగ రాయ్' పై సర్వత్రా ప్రశంసల వర్షం కురిసింది. ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ నేచురల్ స్టార్ నాని రెండు పాత్రల్లోనూ మెరిశాడని మరీ ముఖ్యంగా శ్యామ్ సింగ రాయ్ పాత్రలో సర్ ప్రైజ్ చేశాడని అలాగే సాయి పల్లవి దేవ దాసీ పాత్రలో అద్భుతంగా నటించిందని ఇప్పటి వరకు వీరిద్దరి కెరీర్ లో వన్ ఆఫ్ ద బెస్ట్ పెర్ఫార్మెన్స్ అందించిన సినిమా ఇదేనని ప్రశంసలు కురిపించారు.మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఈ మూవీ చూసిన తరువాత హీరో నేచురల్ స్టార్ నాని సాయి పల్లవిలపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పటి వరకు వీరి కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇదేనని ఈ సందర్భంగా ఈ ఇద్దరితో పాటు కృతిశెట్టి మడోన్నా సెబాస్టియన్ లకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి ఈ మూవీని ప్రత్యేకంగా తిలకించారు. ఆ విషయాన్ని హీరో నాని తెలియజేస్తూ చిరుతో కలిసి దిగిన ఓ ఫొటోని సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా షేర్ చేశారు.శ్యామ్ ని ప్రేమించింది ఎవరో గెస్ చేయండి' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చారు. 'శ్యామ్ సింగ రాయ్' చిత్రంతో శ్యామ్ సింగ రాయ్ పాత్ర మీసం మెలేసే సన్నివేశం హైలైట్ గా వుంటుంది. అదే మేనరిజాన్ని ప్రదర్శిస్తూ చిరు నాని ఫొటోలకు పోజివ్వడం ఆకట్టుకుంటోంది. అంటే 'శ్యామ్ సింగ రాయ్' ఎలా వుందో మెగాస్టార్ చిన్న మేనరిజమ్ తో చెప్పారన్న మాట. నాని ట్వీట్ చేసిన ఈ స్టిల్ ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తోంది. ఇదిలా వుంటే 'శ్యామ్ సింగ రాయ్' జనవరి 21న నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కాబోతోంది.

# అయ్యగారి బ్లాక్ బస్టర్ బ్యాచిలర్ టీఆర్పీ ఎంతంటే..?




యూత్ కింగ్ అఖిల్ అక్కినేని - పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్". దసరా సందర్భంగా విడుదలైన ఈ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ప్రేక్షకులకలను విశేషంగా ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద యాభై కోట్లకు పైగా వసూళ్ళు రాబట్టి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. అక్కినేని వారసుడి కెరీర్ లో ఫస్ట్ కమర్షియల్ హిట్ అనిపించుకుంది.థియేటర్లలో ఘనవిజయం సాధించిన "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్" చిత్రం ఆహా ఓటీటీలోనూ మంచి వ్యూయర్ షిప్ సాధించింది. ఈ క్రమంలో ఇటీవల 'స్టార్ మా' ఛానల్ లో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా ప్రసారమైంది. అయితే తాజాగా అఖిల్ సినిమాకు వచ్చిన టీఆర్పీ బయటికి వచ్చింది. ఈ చిత్రానికి 9.31 టీఆర్పీ రేటింగ్ వచ్చినట్లు తెలుస్తోంది.పెళ్లికి ముందు జీవితం.. పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉండాలనే కాన్సెప్ట్ తో వినోదాత్మకంగా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఆధునిక జీవితంలో చాలా మంది ఎదుర్కొంటున్న రిలేషన్షిప్ సమస్యను.. పెళ్లి అనే సెన్సిటివ్ కాన్సెప్ట్ ను యూత్ కి మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియెన్స్ కి కనెక్ట్ అయ్యేలా చూపించారు దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్. ఇప్పుడు ఇది బుల్లితెర ప్రేక్షకులను కూడా అలరించినట్లు రేటింగ్ చూస్తే అర్థం అవుతోంది. ఇక అదే వీకెండ్ లో టెలికాస్ట్ అయిన 'అరణ్య' చిత్రానికి 5.09 రేటింగ్.. 'హాఫీ కళ్యాణమండపం' సినిమాకి 4.82 టీఆర్పీ వచ్చినట్లు తెలుస్తోంది.కాగా 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 బ్యానర్ పై బన్నీ వాసు - వాసు వర్మ సంయుక్తంగా నిర్మించారు. ఈషా రెబ్బా - నేహా శెట్టి - ఫారియా అబ్దుల్లా అతిథి పాత్రలో కనిపించారు. గోపి సుందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం సమకూర్చగా.. ప్రదేశ్ శర్మ సినిమాటోగ్రఫీ అందించారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ వర్క్ చేశారు.

# పాన్ ఇండియా 'మైఖేల్' మూవీలో క్రాక్ జయమ్మ..!




యంగ్ హీరో సందీప్ కిషన్ - 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ "మైఖేల్". తెలుగు తమిళం కన్నడ మలయాళం మరియు హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి రంజిత్ జయకోడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సందీప్ కిషన్ సరసన దివ్యాంశ కౌశిక్ హీరోయిన్ గా నటిస్తుండగా.. విలన్ గా గౌతమ్ వాసుదేవ్ మీనన్ కనిపించనున్నారు."మైఖేల్" చిత్రంలో ఓ కీలకమైన పాత్రలో నటించేందుకు విలక్షణ నటి వరలక్ష్మి శరత్ కుమార్ ను ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తెలుగులో 'క్రాక్' 'నాంది' వంటి చిత్రాల్లో మెప్పించిన వరలక్ష్మీ.. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్లో తెరకెక్కే సినిమాలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఇదే క్రమంలో ఇప్పుడు సందీప్ కిషన్ హీరోగా నటించే పాన్ ఇండియా మూవీలో భాగం అయింది.గతంలో సందీప్ కిషన్ నటించిన 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో వరలక్ష్మి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు "మైఖేల్" సినిమాలో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు. ఇందులో వరలక్ష్మి శరత్ కుమార్ పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. రంజిత్ జయకోడి రచించిన విలక్షణమైన స్క్రిప్ట్ లో సందీప్ కిషన్ ఇంటెన్స్ రోల్ లో కనిపించనున్నారు. జాతీయ ఉత్తమ నటుడు విజయ్ సేతుపతి స్పెషల్ యాక్షన్ రోల్ పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఒక షూటింగ్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. రెండో షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానుంది.'మైఖేల్' చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ మరియు కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్పి బ్యానర్స్ సంస్థలు రూపొందిస్తున్నాయి. నారాయణ్ దాస్ కె నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి మరియు పుస్కూర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు మరియు సిబ్బంది వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

# రేసులో 1214 మంది ఆటగాళ్లు..

బెంగళూరు వేదికగా ఫిబ్రవరి 12, 13 తేదీల్లో జరగనున్న ఐపీఎల్ 2022 మెగా వేలంలో మొత్తం 1214 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రెండు కొత్త జట్లు(లక్నో, అహ్మదాబాద్) కలుపుకుని మొత్తం 10 జట్లు ఈసారి వేలంలో పాల్గొంటాయి. వేలంలో పేర్లు నమోదు చేసుకునేందుకు జనవరి 20తో గడువు ముగియడంతో బరిలో ఉండే ఆటగాళ్ల తుది జాబితాను బీసీసీఐ శనివారం విడుదల చేసింది. ఈ వేలంలో పాల్గొనబోయే 1214 మంది ఆటగాళ్లలో 896 మంది భారతీయ క్రికెటర్లు కాగా.. 318 మంది విదేశీయులు ఉన్నారు. వీరిలో 270 మంది క్యాప్డ్ (జాతీయ జట్టు తరపున ఆడినవారు), 903 మంది అన్‌క్యాప్డ్




(జాతీయ జట్టుకు ఆడని వారు), 41 మంది అసోసియేట్ ప్లేయర్లు ఉన్నారు. విదేశీ ఆటగాళ్లలో అత్యధికంగా ఆస్ట్రేలియా(59)కు చెందిన వారు కాగా, ఆ తర్వాత సౌతాఫ్రికా (48), శ్రీలంక (36), ఇంగ్లండ్ (30), న్యూజిలాండ్ (29), అఫ్ఘానిస్థాన్ (20) దేశాలకు చెందిన ఆటగాళ్లు ఉన్నారు. నేపాల్ (15), యూఎస్ఏ (14), నమీబియా (5), ఒమన్ (3), భూటాన్ (1), యూఏఈ (1), నెదర్లాండ్స్ (1), స్కాట్లాండ్ వంటి అసోసియేట్ దేశాల ఆటగాళ్లు సైతం మెగా వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. విదేశీ ఆటగాళ్లు కలుపుకుని మొత్తం 49 మంది 2 కోట్ల బేస్ ప్రైజ్ విభాగంలో ఉండగా, భారత్ నుంచి శ్రేయస్ అయ్యర్, శిఖర్ ధవన్‌తో పాటు 17 మంది ఈ విభాగంలో పోటీపడనున్నారు. ఈ విభాగంలో అశ్విన్, చహల్, దీపక్ చాహర్, శిఖర్ ధవన్, శ్రేయస్ అయ్యర్, దినేశ్ కార్తీక్, ఇషాన్ కిషన్, భువనేశ్వర్ కుమార్, దేవదత్ పడిక్కల్, కృనాల్ పాండ్యా, హర్షల్ పటేల్, సురేశ్ రైనా, అంబటి రాయుడు, మహ్మద్ షమీ, శార్దూల్ ఠాకూర్, రాబిన్ ఊతప్ప, ఉమేశ్ యాదవ్ వంటి భారత క్రికెటర్లుండగా.. పాట్ కమిన్స్(ఆస్ట్రేలియా), వార్నర్, డికాక్(దక్షిణాఫ్రికా), డెప్లెసిస్, రబాడ, ఎవిన్ లూయిస్(వెస్టిండీస్) వంటి విదేశీ ఆటగాళ్లున్నారు.

## 'మా ఆటను చూసి భయపడ్డారు.. ఇంకేం ఫైట్ చేస్తారు'

ఆస్ట్రేలియన్ టెన్నిస్ ప్లేయర్ నిక్ కిర్గియోస్ తన వివాదాస్పద వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచాడు. ప్రపంచ డబుల్స్ నెంబర్ వన్ జంట నికోలా మెక్టిక్, మేట్ పావిక్‌లు మాతో ఫైట్ చేయడానికి భయపడ్డారంటూ పేర్కొనడం సంచలనం రేపింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో శనివారం జరిగిన మెన్స్ డబుల్స్ రెండో రౌండ్‌లో నిక్ కిర్గియోస్, తానాసి కొక్కినకిస్ జంట క్రొయేషియాకు చెందిన నికోలా మెక్టిక్, మేట్ పావిక్ జంటను 7-6, 6-3 ఓడించింది. ఈ మ్యాచ్‌ను గెలిచిన నిక్ కిర్గియోస్.. ప్రత్యర్థిపై తన మాటల తోనూ మానసికంగానూ పైచేయి సాధించాలనుకున్నాడు.మ్యాచ్ ముగిసిన అనంతరం లాకర్ రూమ్‌కు వెళ్లిన కిర్గియోస్.. అక్కడ నికోలా మెక్టిక్, మేట్ పావిక్‌ల కోచ్, ట్రైనర్ కనిపించారు. వారి వద్దకు వెళ్లిన కిర్గియోస్ డిబేట్ చేశాడు. "ఆ ఇద్దరు మా ఆటను చూసి భయపడిపోయారు.. ఇంకేం ఫైట్ చేస్తారు" అంటూ పేర్కొన్నాడు. ఇక కిర్గియోస్ ప్రవర్తనపై టెన్నిస్ అభిమానులు మాత్రం గుర్రుగా ఉన్నారు. మొన్న సింగిల్స్ మ్యాచ్‌లో డేనియల్ మెద్వదేవ్‌ను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన కిర్గియోస్.. ఆ మ్యాచ్‌లో ఓటమి పాలయ్యి చేతులు కాల్చుకున్నాడు. తాజాగా డబుల్స్ మ్యాచ్‌లో విజయం సాధించగానే తనలోని మరో కోణాన్ని బయటకు తీశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190